# బస్సు చెప్పిన నీతి

జె.వి.సుబ్బలక్ష్మి




పంచతంత్రం చదువుతూ వాలుకుర్చీలో కూర్చుని వున్న పరంధామయ్య దగ్గరికి వచ్చాడు పక్కింటి రామనాథం.

"ఏమిటి తీరిగ్గా పంచతంత్రం చదువుతున్నావు. ఇంకేం దొరకలేదా కాలక్షేపానికి. చిన్న పిల్లల కథల్లా ఇవి" నవ్వుతూ అన్నాడు రామనాథం.

"ఏమిటి! ఇవి చిన్న పిల్లల కథలా! అసలు ఇందులో భాష కానీ భావం కానీ చిన్న పిల్లలకు అర్థం అవుతుందా! దీన్ని చదవాల్సింది మనలాంటి పెద్దవాళ్ళే నయ్యా. వినోదానికి వినోదం విజ్ఞానానికి విజ్ఞానం వుంది యీకథల్లో. ఒక్కసారి చదివి చూడు నీకు తెలుస్తుంది" అన్నాడు పరంధామయ్య.

కావచ్చు కానీ మరీ జంతువులు, పక్షులు పెట్టి రాశారు కదయ్యా ఆ కథలు".

"అదా! మనుషుల్లో నీతి ఏముంది అని జంతువులు, పక్షులు పెట్టి రాశారు నీతి వుపదేశించడానికి తగినవి అవేనని".

"వినోదానికి కాక తర్కానికి ఆలోచిద్దాం. మనిషికి మిగిలిన జీవజాలంకన్నా విజ్ఞానం ఎక్కువ. ఆలోచన ఎక్కువ కదా! బుర్రలేని, జ్ఞానం లేని పశువులు పక్షులు నీతి కథలు చెప్పాయంటే నవ్వు రాదా"?

"ఎందుకు రావాలి నవ్వు! ఏం పశువులకూ పక్షులకు భావాలు లేవా! మన భాష వాటికి అర్థం కానట్లే వాటి భాష మనకు అర్థం కాదు. అంతమాత్రాన వాటికి భాష లేనట్లా. చైనా వాళ్ళు మాట్లాడితే మనకు అర్థం కాదు. మనిషి మాట్లాడే భాషను అర్థం చేసుకోలేని మనం పశువులకు పక్షులకు భాషలేదని అనడం అన్యాయం" అన్నాడు పరంధామయ్య.

రామనాథం మాట్లాడలేదు. పరంధామయ్య వాదన అయితే సబబుగానే వుంది గానీ ఎందుకో రామనాథానికి అతడితో ఏకీభవించాలనిపించడం లేదు. అది గమనించి పరంధామయ్య,

"అంతెందుకు చెబితే నువ్వు నమ్ముతావో లేదో గానీ

ప్రాణం వున్న పశువులు, పక్షులేమిటి, ప్రాణంలేని వస్తువులు కూడా నీతులు చెప్పగలవు''.

''ప్రాణం లేని వస్తువులా?''

''అవును. ఓ బస్సు చెప్పిన నీతితో ఓ అమ్మాయికి పెళ్ళయింది. నీకా కథ చెబుతా విను'' అని పరంధామయ్య ఈ విధంగా చెప్పసాగాడు.

** ** ** **

భారతదేశంలో దక్షిణాన గల ఆంధ్రదేశమందు హైదరాబాదు అను నగరము కలదు. అందు నానా ప్రాంతముల నుండి ఉద్యోగం కోసం వచ్చి స్థిరపడిన అనేక కుటుంబాలు కలవు. అలాంటి ఒక మధ్య తరగతి కుటుంబంలోని వారే ఒక అన్న, చెల్లెలు. వారి తల్లిదండ్రులు చిన్నతనాన్నే కన్నుమూసిన కారణంగా అల్లారుముద్దుగా చెల్లెల్ని పెంచి పెద్ద చేశాడు అన్న. చెల్లెలికి యుక్త వయస్సు వచ్చింది. సంబంధాలు వెతికాడు అన్న. ఏ సంబంధం చూచినా ఏదో ఒక లోపం చూపేది చెల్లెలు. వచ్చిన ప్రతి సంబంధం యీవిధంగా తప్పి పోవడం అన్నకు నచ్చలేదు. ఏ విధంగానైనా చెల్లెలికి నచ్చజెప్పి ఒక సంబంధం ఖాయం చేసి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడు. ప్రస్తుతం రెండు సంబంధాలు అందుబాటులో వున్నాయి. ఒకడు ఆస్తి పరుడు, అంద చందాలు అంతంత మాత్రం-ఉద్యోగం లేదు. రెండోవాడు ఉద్యోగి, రూపసి. కానీ తనకంటూ చిల్లి గవ్వ స్థిరాస్తి లేనివాడు. రెండింట్లో ఏదైనా పర్వాలేదు అన్పించింది అన్నకు. కానీ చెల్లెలు ఒక నిశ్చయానికి రాలేదు. ఉద్యోగం రూపంలేని, ఆస్తిపరుడూ ఆమెకు నచ్చలేదు. ఆస్తిలేని రూపసి అయిన ఉద్యోగీ నచ్చలేదు. అన్ని కలిప ఒకడిలోనే వుండాలంటుంది. వేరే సంబంధం చూడమని అన్నను కోరింది. కానీ అన్న అందుకు యిష్టపడలేదు. చెల్లెలికి ఎలాగైనా బుద్ధి వచ్చేలా చెయ్యాలనుకున్నాడు. ఆమెను నొప్పించకుండా ఒప్పించే మార్గం కోసం వెదికాడు. ఒకనాడు ఆఫీసు నుంచి యింటికి వస్తుండగా అతడికి అపాయం లేని ఉపాయం ఒకటి తట్టింది. వెంటనే యింటక వచ్చి చెల్లెలిని ఒకసారి నాంపల్లి వెళ్ళి వద్దాం రమ్మని బయల్దేరమన్నాడు.

ఇద్దరూ రోడ్డు పైకి వచ్చి బస్టాపులో నిలబడ్డారు.

నాంపల్లి వెళ్ళే బస్సొకటి వచ్చింది. కానీ బస్టాపుకు ఒక ఫర్లాంగు ముందుకు వెళ్ళి ఆగింది. అది టిక్కెట్టు ఇష్యూపాయింట్ అయినందు వల్ల బస్సు అక్కడ అయిదు నిముషాలు ఆగుతుంది. ''పదమ్మా'' అన్నాడు అన్న. ''వద్దన్నయ్యా ఫర్లాంగు పరుగెత్తాలి. మరోబస్సు చూద్దాం'' అంది చెల్లెలు. ఇంతలో మరో బస్సు వచ్చింది. అది స్టాపుకు ఫర్లాంగు వెనక ఆగింది. ''పోనీ అందులో ఎక్కుదాం పద'' అన్నాడు అన్న. ''వద్దన్నయ్యా అంతదూరం నేను పరుగెత్తలేను'' అంది చెల్లెలు. ఇలా చాలా బస్సులు వెళ్ళిపోయాయి. కానీ ఏ బస్సు కూడా స్టాపులో ఆగలేదు. చివరకు చెల్లెలికే విసుగొచ్చింది. అప్పుడే వచ్చాయి రెండు బస్సులు. ఎప్పటిలాగే ఒకటి అరఫర్లాంగు ముందు, మరొకటి అరఫర్లాంగు వెనక ఆగాయి. ''అందులో ఎక్కుదాం ఏమన్నయ్యా'' అంటూ ముందుకు పరుగెత్తింది చెల్లెలు. కానీ అప్పటికే అది బయలుదేరింది జనం తక్కువ వున్నందువల్ల. ఇది పనికాదని వెనక ఆగిన బస్సు కోసం పరుగెత్తింది. అది కూడా బయలుదేరింది. ఆపమనీ చెయ్యి చాపినా ఆగలేదు బస్సు. బుర్ర గోక్కుంటూ వచ్చి అన్న దగ్గర నిలబడింది చెల్లెలు. ''ఏమ్మా'' అన్నాడు అన్న నవ్వుతూ.

''నీ యిష్టం వచ్చిన సంబంధం నిశ్చయం చెయ్యి అన్నయ్యా'' అంది చెల్లెలు.

''తెలిసిందా అమ్మా, సరిగ్గా స్టాపులోనే ఆగే బస్సు కావాలనుకుంటే గంట దాటినా మనం ఎక్కలేక పోయాం. అదే ఓ ఫర్లాంగు ముందుకో వెనక్కో పరుగెత్తి వుంటే ఏదో ఓ బస్సు అందేది కదా. అలాగే అన్ని లక్షణాలు వున్న మనిషి కావాలనుకుంటే దొరకరు. ఎక్కడో ఒకచోట మనస్సు నిశ్చయం చేసుకోవాలి. అది తెలియాలనే నిన్ను బస్టాపుకు తీసుకు వచ్చాను. లేకుంటే ఆటోలోనే వెళ్ళేవాళ్ళం. పదమ్మా యింటికివెళదాం'' అన్నాడు అన్న. కాస్త బాగా ఆలోచించి ఆస్తి వున్న అబ్బాయితోనే పెళ్ళి నిశ్చయం చేశాడు అన్న. పది రోజుల్లో పెళ్ళయిపోయింది.

** ** ** **

''ఇప్పుడేమంటావు'' అన్నాడు పరంధామయ్య.

''నువ్వు చెప్పింది నిజమే. నేనంతదూరం ఆలోచించలేదు'' అని ఒప్పుకున్నాడు రామనాథం.

*

---

## సంగమం

# తారాస్థాయి

నల్లగా, పొట్టిగా గిడసబారిన వంకాయలా ఉన్న గిరిజని వెంటబెట్టుకొచ్చింది వాళ్ళమ్మ. పిల్ల అచ్చం తల్లి పోలికే.

''మా అమ్మాయికి సంగీతమంటే చాలా ఆసక్తి ఉందండీ. పాటలు కూడా వచ్చండీ. అసలు ఏ పనైనా ఇట్టే పట్టేస్తుంది- చేర్పిద్దామని వచ్చాను. 'ఒక పాట పాడమ్మా'- శారద అడగడం పూర్తి కాకుండానే ఓ మంగళహారతి ఎత్తుకుంది గిరిజ. పాటంతా వచనంలా సమతలంగా సాగిపోతోంది.

''మా అమ్మయి రోజా రేడియో పెట్టుకుని కూడా గట్టిగా పదుతుందండీ- అచ్చం సుశీలే- జానకిది వస్తే ఆవిడలా- ఏపాటైనా ఎవరిది వస్తే వాళ్ళలా పాడేస్తుందండీ కూడా. మా అన్నదమ్ముల ఉమ్మడి సంసారంలో ఇదొక్కతె పాటలు బాగా పాదుతుందండీ- గర్వంగా అంది ఆవిడ. ఆవిడ కామెంట్రీ సాగుతుండగానే గిరిజ పాట ముగించింది.

శారద 'సా' ...అంది గిరిజ కూడా 'సా' అంది (ఎక్కడో!)

పా...పా

సా... తారస్థాయి అంది శారద. గిరిజ తన లావు కంఠంతో 'సా' అంది (మంద్రస్థాయిలోనే)

''అలాక్కాదూ- కంఠం బాగా పైకి హెచ్చించి



అనాలి''. ఆ అమ్మాయి వెంటనే తన కంఠం రూం రూఫ్ పైకి చూస్తూ 'సా' ... అంది.

శారద ఫక్కున నవ్వి పైకి అంటే రూఫ్ పైన కాదు. గొంతు పెంచి చూడూ- నేనెలా అంటే అలా నాతో బాటు కలపాలి అంది. చాలాసేపు అవస్థ పడ్డాక ఎలాగో అయిందనిపించింది శారద.

అప్పుడే అయిపోయిందా?!

''పాఠం గంటసేపు చెప్పారా అండీ'' ఆ తల్లి ఆరాటం చూస్తే సంగీతం మొత్తం నూరుకుని గంటలో తాగెయ్యాలని వున్నట్టుంది.

''మా చిన్న అమ్మాయిని కూడా పంపిస్తాము. మీరేమన్నా 'కన్‌సెక్షన్' (ఆవిడ ఉద్దేశ్యం కన్సెషన్) ఇస్తారా ఇద్దరిమీదా?''- ఆవిడ ప్రశ్నలన్నిటికీ ఓపికగా సమాధానాలు చెప్పింది శారద. ఆవిడ కాస్సేపు కూర్చుని వెళ్ళొస్తానని చెప్పి, గిరిజని క్లాసులో వదిలేసి వెళ్ళారు. శారద తక్కిన పాఠాలు చెప్పడం మొదలు పెట్టింది. కొంతసేపు వాళ్ళ పాఠాలు విన్న గిరిజ ''టీచర్! నన్ను కూడా వీళ్ళలో కలిపేయండి''- అంది. చిన్న చిన్న 'కీర్తనలు' పాడుతున్న వారివైపు ఆశగా చూస్తూ.

శారద అవుననలేదు. కాదనలేదు. చిరునవ్వుతో వింది. శారద బాగా అలవాటు పడిపోయింది. ఆ 'పేట' మనసులకి.

—సూరి సత్యవాణి